సాక్షి రంగారెడ్డి

ఆదివారం। 14 । సెప్టెంబర్ । 2025



తాగునీటికి కటకట!

మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో వారం రోజులుగా తాగునీటి కటకట ఏర్పడింది.

8లో▸



పోస్టులు భర్తీ చేయాలి

పదోన్నతుల్లో మిగిలిన ఖాళీలను అర్హులైన టీచర్లతో భర్తీ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ కోరారు.

8లో▸



రాజకీయాలకు అతీతంగా..

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు.

8లో▸

న్యూస్‌రీల్

డిగ్రీ కోర్సుల్లో చేరికకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల, దోస్త్ కన్వీనర్ పి.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ, ఎంపీసీ, బీఎస్సీ ఎంపీసీఎస్, బీఏ ఈపీపీ, బీఏ హెచ్‌ఈపీ, బీఎస్‌సీ సీబీజెడ్స్, బీఎస్సీసీ బీజెడ్స్, సీఎస్, బీఎస్సీ బీజెడ్ఎస్ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. రెండు విడుతల్లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు ఎస్ఎస్‌సీ మెమో, ఇంటర్ టీసీ, మెమో, కులధ్రువీకరణ పత్రం, బోనఫైడ్, ఆధార్ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 16వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 17న ఎంపికైన విద్యార్థుల జాబితా ప్రకటిస్తామన్నారు.

15,16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు

హయత్‌నగర్: హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 15,16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 176 సీట్లు ఖాళీగా ఉన్నాయని వాటిలో బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులో 21, బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్‌లో 45, బీఎస్సీ లైఫ్‌సైన్స్‌లో 31, బీఏ తెలుగు మీడియంలో 40, బీబీఏలో 39 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వచ్చి కళాశాల దోస్త్ కో ఆర్డినేటర్ నర్సింహను కలవాలని సూచించారు.

సురంగల్ పెద్ద చెరువుకు గండి



కట్టకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

మొయినాబాద్: ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిస్థాయిలో నిండిన సురంగల్ పెద్ద చెరువుకు చిన్నపాటి గండిపడటంతో అధికారులు సకాలంలో స్పందించారు. గండి పూడ్చి మరమ్మతులు చేయించడంతో ప్రమాదం తప్పింది. మున్సిపల్ పరిధిలోని సురంగల్ పెద్ద చెరువులోకి కొన్ని రోజులుగా వరద రావడంతో పూర్తిస్థాయిలో నిండింది. చెరువు కట్టకు చిన్నపాటి గండి పడి నీళ్లు కిందికి వెళ్తున్నాయి. గండి పెద్దది కాకముందే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు స్పందించారు. ఇరిగేషన్ ఏఈ ప్రియాంక, ఆర్ఐ రాజేష్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ నర్సింహ తదితరులు శనివారం చెరువు వద్దకు చేరుకుని కట్టను పరిశీలించారు. మట్టి పోసి కట్టకు పడిన గండిని పూడ్చి మరమ్మతులు చేయించారు.

కేటీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ భేటీ



ఆమనగల్లు: మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసారు. హైదరాబాద్‌లోని కేటీఆర్ నివాసంలో శనివారం ఆయనను కలిసి పార్టీ గురించి చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విజితారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పానుగోటి అర్జున్‌రావ్ ఉన్నారు.

ఆర్టీసీ వినూత్న ప్రయోగం

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టిందని ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వెంకటనర్సప్ప తెలిపారు. దాతల ద్వారా సేకరించిన విరాళాలతో అనాథలు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులకు పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు ఉచిత యాత్ర ప్రవేశపెడుతోందని చెప్పారు. దాతలు, కార్పొరేట్ సంస్థలు, ప్రజాప్రతినిధులు విరాళాలు అందించి భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.



డ్రైవరే సూత్రధారి



రికవరీ సొత్తును పరిశీలిస్తున్న సీపీ అవినాష్ మహంతి, చిత్రంలో రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తదితరులు

వీడిన శంకర్‌పల్లి రాబరీ కేసు

- పథకం ప్రకారమే రూ. 40 లక్షలు కొట్టేసిన నిందితులు
- 24 గంటల్లో ఛేదించిన సైబరాబాద్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రూ. 40 లక్షల దారి దోపిడీ కేసును సైబరాబాద్ పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. కారు పార్కింగ్ లైట్లు వెలగడమే దోపిడీకి సిగ్నల్‌గా పెట్టుకొని రాబరీకి పాల్పడినట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. ప్రధాన సూత్రధారి కారు డ్రైవర్ మధుతో పాటు మరో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆయా వివరాలను సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి శనివారం మీడియాకు వెల్లడించారు.

◆ హైదరాబాద్‌కు చెందిన రాకేష్ అగర్వాల్‌కు సాయిబాబా అనే వ్యక్తి మేనేజర్‌గా వ్యవహరిస్తున్నాడు. వ్యాపార అవసరాల నిమిత్తం సాయిబాబా ఎక్కడికి వెళ్లాలన్నా బీఎన్ రెడ్డి నగర్‌కు చెందిన కార్ యజమాని, డ్రైవర్ మధు కాసులను సంప్రదించేవాడు. ఈ క్రమంలో సాయిబాబా కదలికలను మధు గమనిస్తూ ఉండేవాడు. ఈనెల 12న రాకేష్ అగర్వాల్ వికారాబాద్‌లోని అన్సారీ అనే కస్టమర్ నుంచి రూ. 40 లక్షలు వసూలు చేసి తీసుకురమ్మని సాయిబాబాను ఆదేశించాడు. దీంతో సాయిబాబా మధుకు ఫోన్ చేసి వికారాబాద్‌కు తన క్యాబ్ బుక్ చేసుకున్నాడు. అప్పుడే సాయిబాబా భారీ డబ్బును తీసుకొస్తాడని మధు ఊహించాడు.

దారి దోపిడీకి స్కెచ్

పథకం ప్రకారం మధు తన స్నేహితులైన ఆర్సీపురానికి చెందిన విజయ్‌కుమార్, కాచిగూడకు చెందిన మహ్మద్ అజర్‌లకు ఈ విషయాన్ని తెలిపాడు. ఇరువురిపై గతంలో ఫోర్జరీ, డ్రగ్స్, దొంగతనాల కేసులు కూడా ఉన్నాయి. దోపిడీ చేసేందుకు విజయ్ పాత నేరస్తుడైన గచ్చిబౌలికి చెందిన హర్షవర్ధన్‌ను నియమించుకున్నాడు. నలుగురు కలిసి వికారాబాద్ నుంచి హైదరాబాద్‌కు మార్గంలో రెక్కీ నిర్వహించారు. రద్దీ తక్కువగా ఉండే ప్రాంతం, దోపిడీ తర్వాత సులువుగా తప్పించుకునే వీలున్న హుస్సేన్‌పూర్ గేట్ వద్ద దోపిడీ చేయాలని నిర్ణయించుకున్నారు.

పారిపోతుండగా అదుపుతప్పిన కారు

మధు కారు హుస్సేన్‌పూర్ గేట్ వద్దకు చేరుకోగానే ముందుగా వేసిన పథకం ప్రకారం.. హర్ష పార్కింగ్ లైట్లు వెలిగించాడు. దీంతో మధు కార్‌ను కాస్త స్లో చేశాడు. దీంతో వెంటనే హర్ష కార్‌ను ఓవర్‌టేక్ చేసి మధు కార్‌ను ఢీ కొట్టాడు. హర్ష ప్రయాణిస్తున్న మధు కార్‌ను ఓవర్ టేక్ చేసి వారిని అడ్డుకుంది. కారులో నుంచి ముగ్గురు వ్యక్తులు దిగి సాయిబాబాను కొట్టి రూ.40 లక్షలు ఉన్న బ్యాగ్‌ను లాక్కున్నారు. కారులో సంఘటనా స్థలం నుంచి తప్పించుకుంటుండగా.. కొత్తపల్లి శివార్లలో నిందితులు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పింది. వెనుక ఎస్కార్ట్ వాహనంలో వస్తున్న విజయ్ తన కార్‌లో హర్ష బృందాన్ని ఎక్కించుకొని హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఘటన స్థలంలో కారు అదుపుతప్పిన విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ఆధారాలను సేకరించారు. కారు నంబర్ ఆధారంగా పోలీసులు యజమాని అనుదీప్ పట్టుకున్నారు. అతను ఇచ్చిన సమాచారంతో సైబరాబాద్ పోలీసులు సంగారెడ్డి, షాద్‌నగర్ పోలీసులను అప్రమత్తం చేశారు. ముంబై హైవేలో జహీరాబాద్ వద్ద కొందరు.. బెంగళూరు హైవేలోని రాయికల్ టోల్ ప్లాజా వద్ద కొందరు మొత్తం ఏడుగురు వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల నుంచి రూ. 17.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

ఎస్కార్ట్ వాహనంలో..

ఈ నెల 12న ఉదయం 11:30 గంటలకు సాయిబాబా, డ్రైవర్ మధుతో పాటు కారులో వికారాబాద్ చేరుకున్నాడు. అన్సారీ నుంచి రూ. 40 లక్షలు తీసుకొని, కారులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. హర్ష తన స్నేహితులైన మహబూబ్‌నగర్‌కు చెందిన అనుదీప్ అలియాస్ లడ్డు స్విఫ్ట్ డిజైర్ కార్‌ను తీసుకొని హఫీజ్‌పేటకు చెందిన దీపక్, హుస్సేనీఆలంకు చెందిన షమీముల్లాలతో కలిసి కారులో మధు కారును వెంబడిస్తున్నారు. వీరి వెనుక ఎస్కార్ట్ వాహనంలో విజయ్, అజార్‌లు అనుసరిస్తున్నారు. డ్రైవర్ మధు నిరంతరం విజయ్‌తో ఫోన్‌లో తన లొకేషన్ వివరాలను అందిస్తూ ఉన్నాడు. దీన్ని విజయ్ హర్ష్‌కు పంపిస్తూ ఉన్నాడు.



సమావేశంలో మాట్లాడుతున్న అబ్బాస్

వాస్తవాలు తెలుసుకోవాలి

ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్బాస్

తుర్కయంజాల్: మేధావులు మౌనంగా ఉంటే చరిత్రను వక్రీకరించే అవకాశం ఉంటుందని, ప్రజలకు అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆవాజ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు అబ్బాస్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శనివారం తుర్కయంజాల్‌లోని అరుణ కన్వెన్షన్ హాల్‌లో 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం- వాస్తవాలు, వక్రీకరణ' అంశంపై టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ.. 1946 సెప్టెంబర్ 11న ప్రారంభమైన సాయుధ పోరాట పిలుపు చారిత్రక మలుపుగా నిలిచిందని, ఈ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర ఎనలేనిదని గుర్తు చేశారు. నిజాం ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ఎంతో మంది కమ్యూనిస్టులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ఆ పోరాట ఫలితంగానే తెలంగాణలో నిజాం పాలన అంతం కావడం, ప్రజలకు వెట్టి చాకిరి నుంచి విముక్తి లభించడం, పేదలకు వ్యవసాయ భూమి దక్కాయని అన్నారు. బీజేపీ ఏటా సెప్టెంబర్ వచ్చిందంటే చాలు తామే సాయుధ పోరాటాన్ని నడిపినట్లు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్యలను కూడా అవమానించేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. నేటి తరం యువత వాస్తవాలను గ్రహించి, చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, ఉపాధ్యక్షుడు బింగి రాములయ్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుగంధ, సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య పాల్గొన్నారు.

రాజీమార్గం ఉత్తమం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

ఇబ్రహీంపట్నం: క్షణికావేశంలో జరిగిన గొడవలు, పంచాయతీలతో కేసుల్లో చిక్కిన కక్షిదారులు రాజీమార్గం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవడం శ్రేయస్కరమని ఇబ్రహీంపట్నం కోర్టు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీదేవి అన్నారు. ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 1,112 సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వివిధ కేసుల్లో న్యాయస్థానాల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడేకంటే రాజీపడి పరిష్కరించుకోవడం మేలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి రీటాలాల్ చంద్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి యశ్వంత్‌సింగ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్, ఏసీపీ రాజు పాల్గొన్నారు.

ఉద్యమకారుల డిమాండ్లు నెరవేర్చాలి



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీమా సీను, జిల్లా అధ్యక్షుడు కొంతం యాదగిరిరెడ్డి పేర్కొన్నారు. అక్టోబర్ 26న చలో ఇందిరా పార్కు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన 584 మండలాల ఉద్యమకారుల చైతన్య యాత్ర శనివారం యాచారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉద్యమాలతో తెలంగాణ సాధించుకున్నామని గుర్తు చేశారు. పదేళ్లలో ఉద్యమకారులని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, సంక్షేమ బోర్డుకు రూ.10వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు, ట్రైన్ పాసులు, ఆరోగ్య కార్డులు కల్పించాలని, ఉద్యోగాల్లో 20 శాతం కోట కేటాయించాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యత కల్పించి పదవులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విష్ణు, నరేందర్, శ్యామల, బోసుపల్లి వీరేశం, శ్యామ్, నక్క జంగయ్యగౌడ్, కందుకూరి జంగయ్య, కారింగ శంకర్, గండికోట పాండు, బైరెడ్డి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం చేరిన బస్సుయాత్ర

ఇబ్రహీంపట్నం: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని చేపట్టిన బస్సుయాత్ర శనివారం ఇబ్రహీంపట్నం చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యమకారులు డా. శ్రీనివాస్, డబ్బికార్ శ్రీనివాస్, కొంతం యాదగిరిరెడ్డి, బోసుపల్లి వీరేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉద్యమకారులకు ఇస్తామన్న 250 గజాల ప్లాట్లు, పింఛన్లు, గుర్తింపు కార్డులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారులు విష్ణువర్ధన్, జానికిరెడ్డి, శ్యామల, మహేందర్, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐ చాట్‌బాక్స్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

విద్యాభివృద్ధికి పెద్దపీట

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: సాంకేతిక విద్యలో ప్రపంచంతో పోటీపడే విధంగా గిరిజన గురుకులాల విద్యార్థులను తయారు చేస్తామని గిరిజన, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరిలక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణంలో రెండు రోజులుగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి, గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)పై జాతీయ సదస్సు కొనసాగుతోంది. పట్టణ సమీపంలోని కుంట్లరాంరెడ్డి గార్డెన్‌లో శనివారం నిర్వహించిన సదస్సు ముగింపు సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్ తరాల విద్యార్థుల అభివృద్ధికి ఏఐ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరిక మేరకు కొత్తూరు మండలంలోని దర్గా అభివృద్ధికి రూ.8 కోట్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యను అభ్యసించాలని అన్నారు. అనంతరం వెబ్‌సైట్‌లో గురుకుల కళాశాలల సమాచారంతో కూడిన ఏఐ చాట్‌బాక్స్‌ను ఆవిష్కరించారు. ఏఐలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సాంఘీక సంక్షేమశాఖ గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి, డిప్యూటీ కార్యదర్శులు లింగారెడ్డి, వేణుగోపాల్ రావు, పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమేష్‌బాబు, ఐఐటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌సీతాపోలె తదితరులు పాల్గొన్నారు.

కత్తులు దూసిన కుటుంబ కలహాలు

- వ్యక్తికి తీవ్ర గాయాలు
- పోలీసుల అదుపులో నిందితులు


దాడిలో గాయపడిన పృథ్వీరాజ్

షాద్‌నగర్ రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తిపై కత్తులతో దాడి చేసిన ఘటన శనివారం ఉదయం షాద్‌నగర్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని ఆశాకాలనీకి చెందిన కాంట్రాక్టర్ గంతల ప్రభుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య కుమారుడు పృథ్వీరాజ్ తన కొడుకుతో కలిసి శనివారం ఉదయం బైక్‌పై పట్టణ శివారులోని ఓ డెయిరీ ఫాంకు వెళ్లి, పాలు తీసుకొని ఇంటికి వస్తున్నాడు. కేశంపేట రైల్వే గేటు మలుపు వద్ద మాటువేసిన ప్రభు రెండో భార్య కుమారులు నందీశ్వర్, భరత్ అతనిపై కత్తులతో దాడి చేసి, పరారయ్యారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే పోలీసుకు సమాచారం అందించారు. రక్త గాయాలతో కింద పడిన పృథ్వీరాజ్‌ను చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ గొడవలే దాడికి కారణమని బాధితుడు తెలిపాడు ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి


సమావేశానికి హాజరైన ప్రతినిధులు

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్
- ఇబ్రహీంపట్నంలో సంఘం సర్వసభ్య సమావేశం

ఇబ్రహీంపట్నం: పదోన్నతులలో మిగిలి పోయిన ఖాళీలను.. అర్హులైన ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పుట్టపాక ప్రవీణ్‌కుమార్ కోరారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంఘం ఇబ్రహీంపట్నం సెక్టార్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా టీచర్ల కొరత ఏర్పడిందని తెలిపారు. అర్హత ఉన్నవారికి పదోన్నతి కల్పించి, వాటిని భర్తీ చేయాలని సూచించారు. ఈ ఏడాదిలో పదోన్నతులు కల్పించకపోతే అనేక మంది ఉద్యోగ విరమణ పొందుతారని పేర్కొన్నారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగుల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను తిరిగి పునరుద్ధరించడం హర్షణీయమని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు పాండు రంగారెడ్డి మాట్లాడుతూ.. జీఓ 317 ద్వారా నష్టపోయిన స్థానికులకు న్యాయం చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి, క్రమం తప్పకుండా డీఏలను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాండు రంగారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, పరమేశ్, శ్రీనివాస్‌రావు, బాలకృష్ణ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీ కోసమే లోక్ అదాలత్‌లు

ముందుకు రావాలని జడ్జీల సూచన

చేవెళ్ల: కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌లు ఉపయోగపడుతాయని చేవెళ్ల కోర్టు సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య, జూనియర్ సివిల్ జడ్జి విజయ్‌కుమార్ ఉపాధ్యాయ, రిటైర్డు జడ్జి సాంబశివరావులు పేర్కొన్నారు. శనివారం కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 8వ తేదీ నుంచి 13వ తేదీ వరకు వివిధ రకాల కేసులు 1014 పరిష్కరించటంతోపాటుగా జరిమానా కింద రూ.24,18,300 విధించినట్లు తెలిపారు. అనుకోకుండా, క్షణికావేశంలో జరిగే గొడవలతో అనేక కేసులు వేసుకొని కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారు ఎందరో ఉన్నారన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కేసుల పరిష్కారం కోసం లోక్ అదాలత్‌లను తీసుకు వచ్చి అనేక కేసులను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు క్రిష్ణగౌడ్, నర్సింలు, ప్రధాన కార్యదర్శి మహేశ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి యాదగిరి, ఏజీపీ గీతావనజాక్షి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ప్రకాశం, శివరాజ్, సీనియర్ సూపరింటెండెంట్ యాదయ్య, న్యాయవాదులు క్రిష్ణవేణి, ఇందిర, పాండురంగారెడ్డి, చంద్రశేఖర్, కుమార్, అభిలాష్‌రెడ్డి, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో జడ్జీలు, న్యాయవాదులు

తాగునీటికి కటకట!

వర్షాకాలంలోనూ తప్పని తిప్పలు

- హిమాయత్‌నగర్‌లో పైపులైన్లు పగిలి భగీరథ నీళ్లు బంద్
- బోరు మోటార్ల కాలిపోయినా పట్టించుకోని అధికారులు
- వారం రోజులుగా అవస్థలు పడుతున్న ప్రజలు


హిమాయత్‌నగర్‌లో ఓ ఇంటి వద్ద నీళ్లు పోస్తున్న ట్యాంకర్

మొయినాబాద్: వర్షా కాలంలోనూ ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడం.. స్థానికంగా ఉన్న బోరు మోటార్లు కాలిపోవడంతో మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో వారం రోజులుగా తాగునీటి కటకట ఏర్పడింది. దీంతో ప్రజలు ప్రైవేట్ ట్యాంకర్లతో నీళ్లు పోయించుకుంటున్నారు. గ్రామానికి నీటి సరఫరా అయ్యే మిషన్ భగీరథ పైపులైన్లు పగిలిపోవడంతోపాటు స్థానికంగా ఉన్న బోరు మోటార్లు కాలిపోవడంతో వారం రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్లు, బోరు మోటార్లకు మరమ్మతులు చేయించాల్సిన మున్సిపల్ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో విధిలేని పరిస్థితిలో ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని పోయించుకుంటున్నామని చెబుతున్నారు.

గ్రామస్తుల ఆందోళన

హిమాయత్‌నగర్‌లో వారం రోజులుగా మంచినీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని శనివారం స్థానికులు ఆందోళన చేశారు. గ్రామంలో తాగునీటి సమస్యతోపాటు ఇతర సమస్యలు చాలా ఉన్నాయని.. మున్సిపల్ అధికారులకు ఫోన్ చేసినా స్పందించడంలేదని మండిపడ్డారు. రోజుకో దగ్గర మిషన్ భగీరథ పైపులైన్లు పగిలిపోతున్నాయని, మరమ్మతులు చేయాలని చెప్పినా ఎవరూ స్పందించడం లేదన్నారు. వీధిదీపాలు సరిగా లేవని.. రోడ్లపైనే మురుగునీరు పారుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. వీటిపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలతోపాటు మున్సిపల్ కమిషన్ తీరుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

బొంరాస్‌పేట: మండల కేంద్రం శివారులో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన సంఘటన జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కోస్గి మండలం తొగాపూర్‌కు చెందిన బొప్పలి వెంకటేశ్ శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో బొంరాస్‌పేట చెరువు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్ కాళ్లు, చేతులు విరిగి ఆస్పత్రి పాలయ్యాడు. క్షతగాత్రుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల వెంకటరమణ తెలిపారు.

శ్మశానవాటికలో చెట్ల నరికివేత

ఇద్దరికి జరిమానా విధించిన అధికారులు

తుర్కయంజాల్: శ్మశానవాటికలోని చెట్లను నరికిన వ్యక్తులకు మున్సిపల్ అధికారులు జరిమానా విధించిన సంఘటన పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలో శనివారం చోటు చేసుకుంది. 10వ వార్డులోని శ్మశానవాటికలో ఉన్న 3 పెద్ద కానుగు చెట్లను ఎస్‌ఎస్‌ఆర్ నగర్‌కు చెందిన ఎస్.లక్ష్మయ్య, మల్లయ్య ఎలాంటి అనుమతులు లేకుండా నరికి వాహనంలో తరలించారు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వనిత, కమిషనర్ అమరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.15వేలు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ సురేశ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చెట్లు నరికిన వ్యక్తులకు జరిమానా రసీదును అందజేస్తున్న అధికారులు

పురుగు మందు తాగి డ్రైవర్ ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కుర్మల్‌గూడ రాజీవ్ గృహకల్పలో నివాసం ఉండే మోతిలాల్(40) డ్రైవర్ పని చేసుకుంటూ జీవించేవాడు. కుటుంబ కలహాలతో ఈ నెల 8వ తేదీన పురుగు మందు తాగాడు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఆయన మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

మట్టి ట్రాక్టర్ పట్టివేత

మాడ్గుల: మండలంలోని మాడ్గుల గ్రామ శివారులోని వాగు నుంచి శనివారం ఉదయం అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ వేణుగోపాల్‌రావు తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి ప్రశ్నించగా ఎలాంటి అనుమతులు లేవని చెప్పడంతో వాటిని సీజ్ చెసినట్లు చెప్పారు. డ్రైవర్, వాహన యాజమానులపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

బతుకుపోరాటంలో ఆగిన గుండె


అశోక్ (ఫైల్)

కందుకూరు: బతుకు పోరాటంలోనే ఓ గుండె ఆగిపోయింది. మండల పరిధిలోని కటికపల్లికి చెందిన ఎంట్ల అశోక్(35) టిప్పర్‌పై డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజూ మాదిరిగానే శనివారం ఉదయం గ్రామ సమీపంలోని క్రషర్ మిషన్ వద్ద డస్ట్ లోడ్ నింపుకొని బయలుదేరాడు. మార్గమధ్యలో ఛాతిలో నొప్పి రావడంతో వాహనాన్ని పక్కకు నిలిపేసి, డ్రైవింగ్ సీట్లోనే ప్రాణం వదిలాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. అశోక్ మృతితో వీరంతా దిక్కులేని పక్షులయ్యారు. అందరితో కలివిడిగా ఉండే వ్యక్తి మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బైక్ దొంగకు ఏడాదిన్నర జైలు


అఫ్రోజ్‌ఖాన్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: నిత్యం బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఓ దొంగకు ఏడాదిన్నర జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రావిర్యాల సమీపంలో గ్యార దశరథ అనే వ్యక్తి స్కూటీని 2025 మార్చి17న రైస్ గోదాం వద్ద పెట్టి పనులు చేసుకుంటుండగా దొంగిలించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పట్లో పోలీసులు సీసీ కెమెరాలు ఆధారంగా కేసును ఛేదించారు. మహమ్మద్ అఫ్రోజ్‌ఖాన్ దొంగిలించినట్లు గుర్తించి కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారు. అప్పటి నుంచి కోర్టులో విచారణ జరిగింది. కేసు పూర్వపరాలను పరిశీలించిన ఇబ్రహీంపట్నం 15 ఎంఎం కోర్టు న్యాయమూర్తి నిందితుడు అఫ్రోజ్‌ఖాన్‌కు ఏడాదిన్నర జైలుశిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్, కవాడిపల్లి, చిన్నరావిరాల, ఇనాంగూడ, మజీద్‌పూర్ గ్రామాల్లో రూ.88.50 లక్షల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు శనివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. ప్రతి పేదవాడి ముఖంలో ఆనందాన్ని చూడాలన్నదే ప్రజా ప్రభుత్వం లక్ష్యమన్నారు. పేదలను దృష్టిలో పెట్టుకునే వారికి అన్ని విధాలుగా లబ్ధి చేకూర్చేందుకు సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతున్నామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థులనే గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మండల, గ్రామ పంచాయతీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అబ్దుల్లాపూర్‌మెట్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

శాంతియుతంగా ర్యాలీ నిర్వహించాలి

పహాడీషరీఫ్: మిలాద్-ఉన్-నబీ ర్యాలీని శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డి సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం రాత్రి పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ పరిధిలోని జల్‌పల్లి, వాదే ముస్తాఫా, పహాడీషరీఫ్ ప్రాంతాలలో శాంతియుతంగా ర్యాలీలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలతో పాటు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

నకిలీ దస్తావేజులతో స్థలం రిజిస్ట్రేషన్

- ములుగు అగ్రికల్చర్ యూనివర్సిటీ సూపరింటెండెంట్ సహా ఇద్దరి అరెస్టు
- పరారీలో మరో 9 మంది నిందితులు

రాజేంద్రనగర్: మృతి చెందిన మహిళకు చెందిన విలువైన ఖాళీ స్థలాన్ని దొంగ దస్తావేజులు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన ములుగు అగ్రికల్చర్ యూనివర్సిటీ సూపరింటెండెంట్‌తో పాటు 10 మందిపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సూపరింటెండెంట్‌తో పాటు మరో వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం... రాజేంద్రనగర్ బుద్వేల్ సర్వే నంబర్ 95లో ఆయేషా సుల్తానా పేరిట ప్లాట్ ఉంది. వీరి కుటుంబం దుబాయిలో నివశిస్తోంది. 2019లో ఆయేషా సుల్తానా మృతి చెందింది. అప్పటి నుంచి ఈ ప్లాట్ దగ్గరకు ఎవరూ రావడం లేదు. ఈ ప్రాంతంలో రోజురోజుకూ ధరలు భారీగా పెరుగుతున్నాయి. దీనిపై కన్నేసిన ములుగు అగ్రికల్చర్ యూనివర్సిటీ సూపరింటెండెంట్ నవీదుల్ హఫీజ్(53) మహ్మద్ ఉబేద్ బిన్‌తో కలిసి నకిలీ దస్తావేజులు సృష్టించారు. వీరికి మరో 9 మంది సాయం చేశారు. ఈ ప్లాట్‌ను నవీదుల్ హఫీజ్ తన కుమారుడికి రిజిస్ట్రేషన్ చేయించాడు. గత నెలలో నగరానికి వచ్చిన ఆయేషా సుల్తానా కుమారుడు ఇంతియాజ్ ప్లాట్ వద్దకు వచ్చి పరిశీలించగా ఇతరులకు విక్రయించారని తెలిసింది. దీంతో ఆయన రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దస్తావేజులన్నింటినీ పరిశీలించి విచారించారు. హఫీజ్ ప్రోత్సాహంతో ఈ నకిలీ దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేశారని పోలీసులు నిర్ధారించారు. ఇద్దరిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో 9 మంది నిందితులు పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో వివరించారు.

మహిళతో దురుసు ప్రవర్తన: ముగ్గురిపై కేసు

బంజారాహిల్స్: కారులో ప్రయాణిస్తున్న ఒక మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించిన ముగ్గురిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల సమాచారం మేరకు... కోకాపేటకు చెందిన ఒక ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యజమాని అంజలీరావు జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-45లో తన కారులో ప్రయాణిస్తున్నారు. శుక్రవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో రోడ్ నంబర్-45లో ఎలక్ట్రిక్ స్కూటీపై వచ్చిన వాహనదారుడు ఆమె కారును ఢీకొట్టడంతో కారు వెనుక భాగం దెబ్బతింది. పారిపోవడానికి ప్రయత్నించిన వాహనదారుడి వాహన తాళం చెవులను ఆమె తీసుకొంది. దీంతో ఆగ్రహించిన వాహన డ్రైవర్ ఆమెను నెట్టివేయడంతో మరో కారుపై పడింది. ఈ క్రమంలో కారులో ఉన్న మహిళ కిందకు దిగడంతో గొడవ మరింత పెద్దదైంది. అదే సమయంలో మరో వాహనదారుడు సైతం అంజలీరావుతో గొడవకు దిగాడు. తాళం చెవులు ఇవ్వాలంటూ ఒత్తిడి చేశాడు. వాహనదారుడు మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించి ఆమె నుంచి తాళం చెవులను లాక్కున్నాడు. గొడవ అనంతరం గమనించగా అంజలీరావు చేతికి ఉన్న రూ. 7 లక్షల విలువైన బ్రేస్లెట్ కనిపించలేదు. దీంతో ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వాహనదారుడు, మహిళతోపాటు, మరో వాహనదారుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.